

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 55 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 +https:www.prajarepublic.com + వెల - 1/-

ఆదివారం 29 సెప్టెంబర్ 2024

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## బెంగాల్‌ను వరదలు ముంచెత్తుతున్నా.. కేంద్రం సాయం చేయడంలేదు :మమతా బెనర్జీ


పశ్చిమ బెంగాలు వరదలు అతలాకుతలం చేయడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు.



కోల్‌కతా, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: బెంగాల్ ఉత్తరాది జిల్లాల్లో వరదల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కోవడానికి కేంద్రం నుంచి తమ రాష్ట్రానికి ఎటువంటి సహాయం అందట్లేదని ఆరోపించారు. తీవ్ర వరద ప్రభావాన్ని ఎదుర్కొంటున్న ఉత్తరాది జిల్లాలను పరిశీలించిన ముఖ్యమంత్రి.. సహాయచర్యలకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. "ఉత్తర బెంగాల్ వరదలతో కొట్టుమిట్టాడుతోంది. కూచ్ బెహార్, జల్పాయిగుడి.. తదితర జిల్లాల్లో ప్రజలుతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కోశి నది పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల ఇతర జిల్లాలు కూడా అతలాకుతలం అవుతున్నాయి" అని ఆమె అన్నారు. విపత్తును ఎదుర్కోవడానికి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహాయాన్ని అందించట్లేదన్నారు. ఫరక్కా బ్యారేజీ నిర్వహణ పనులను సైతం చేపట్టట్లేదని..దాని వల్ల అందులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) డ్యామ్లు వద్ద డ్రెడ్జింగ్ చేయడంలో విఫలమైందని.. అందువల్లే బెంగాల్ లోని పలు జిల్లాల్లో వరదలు సంభవించాయని ఆరోపించారు. మానవ ప్రమేయంతో వచ్చిన ఈ వరదలకు డీవీసీనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఝార్కండ్–బెంగాల్ సరిహద్దులో మైథాన్, పంచేత్ల వద్ద డీవీసీ డ్యామ్లు ఉండగా.. డీవీసీ ఈ ఏడాది 5.5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడమే తాజా పరిస్థితికి కారణమని ఆమె ఆరోపించారు.

## ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. హైదరాబాద్ టూ విజయవాడకు ఈ-గరుడ బస్సులు

హైదరాబాద్ : విజయవాడకు వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది.





హైదరాబాద్ (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: విజయవాడకు వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. బీహెచ్ఎల్ డిపో నుంచి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడకు కొత్తగా రెండు ఈ -గరుడ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు రంగారెడ్డి రీజనల్ మేనేజర్ శ్రీలత తెలిపారు. ఈనెల 30న ఈ–గరుడ బస్సులను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బస్సులు రామచంద్రపురం, బీరంగూడ, చందానగర్, మియాపూర్, నిజాంపేట్ క్రాస్ రోడ్స్, హౌసింగ్ బోర్డ్ మీదుగా జేఎన్టీయూ రైతు బజార్, మలేషియన్ టౌన్ షిప్, శిల్పారామం, సైబర్ టవర్స్, మై హోమ్ భుజా, సైబరాబాద్ కమిషనరేట్, టెలికాంనగర్ మీదుగా ఓఆర్ఆర్ నుంచి విజయవాడకు ప్రయాణిస్తాయని చెప్పారు. తద్వారా ప్రయాణికులకు ట్రాఫిక్ జామ్ సమస్య నుంచి విముక్తి కలుగుతుందన్నారు. ప్రతిరోజూ రాత్రి 9:30, 10:30 గంటలకు రామచంద్రాపురం నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. కాబట్టి ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అధిష్ఠానం ఆదేశం.. 'సేవ్ తిరువూరు' ర్యాలీ విరమించుకున్న ఎమ్మెల్యే కొలికపూడి

తెదేపా అధిష్ఠానం ఆదేశాలతో సోమవారం సాయంత్రం 4గంటలకు చేపట్టిన 'సేవ్ తిరువూరు' ర్యాలీ విరమించుకున్నట్టు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు.

తిరువూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: తెదేపా అధిష్ఠానం ఆదేశాలతో సోమవారం సాయంత్రం 4గంటలకు చేపట్టిన 'సేవ్ తిరువూరు' ర్యాలీ విరమించుకున్నట్టు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో 'సేవ్ తిరువూరు' పేరుతో ర్యాలీకి కొలికపూడి పిలుపునిచ్చారు. ర్యాలీ విరమించుకోవాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశించారని, ర్యాలీ విరమించుకున్నట్టు ఆదివారం సాయంత్రం వీడియో విడుదల చేశారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. శనివారం తిరువూరు నుంచి తరలి వచ్చిన మీడియా ప్రతినిధులు తెదేపా కేంద్ర కార్యాలయంలో సీఎంను కలిసి ఫిర్యాదు చేశారు. మీడియా ప్రతినిధులను కించపరిచేలా ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని తెలిపారు. కొలికపూడి బెదిరించారంటూ కొన్ని ఆధారాలను సీఎంకు అందజేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు అన్ని విషయాలు తెలుసన్న చంద్రబాబు.. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



## ఏపీలో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు.. చైర్మన్గా మంత్రి నారా లోకేశ్

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేసింది.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేసింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ జీవోను విడుదల చేసింది. ఫోరం చైర్మన్ గా మంత్రి నారా లోకేశ్ వ్యవహరించనున్నారు. రెండేళ్ల కాలపరిమితితో ఇది పనిచేయనుంది. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తల మధ్య అనుసంధానకర్తగా ఈ ఫోరం పనిచేయనుంది. ప్రభుత్వశాఖలను ఆర్టీజీఎస్ శాఖ సమన్వయం చేయనుంది.

## పేదవాళ్లను అడ్డంపెట్టి.. బిల్డర్ల వ్యాపారం: భట్టి విక్రమార్క

అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన అంశాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.



(రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన అంశాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు తెలంగాణతో పాటు, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలన్నారు. హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్... ఇళ్ల నిర్మాణం పేరిట రాళ్లు కనుమరుగైపోయాయి. లేక్స్ కబ్జా చేసి ఇళ్లు కట్టుకున్నారు. పార్కులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేక్స్ లేకపోతే ఇటీవల విజయవాడ నగరం వరదలో చిక్కుకుపోయిన పరిస్థితులు హైదరాబాద్లోనూ ఏర్పడతాయన్నారు. పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్స్ నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ధన, ప్రాణ, ఆస్తులు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, అందులో భాగంగా చెరువులను రక్షించి, భవిష్యత్తు తరాలకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపటినట్లు చెప్పారు. మూసీ నదిలో మంచినీరు పారించడం, పార్కులు తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వనరులను గుర్తించి పద్ధతి ప్రకారం వాటిని వినియోగిస్తామన్నారు. కాలిఫోర్నియాలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఫిర్యాదు.. మాజీ మంత్రి ఆళ్ల నానిపై చీటింగ్ కేసు


మాజీ మంత్రి ఆళ్ల నానిపై చీటింగ్ కేసు నమోదైంది. ఎన్నికల ప్రచార సమయంలో వైకాపా నాయకురాలు నాగమణి గాయపడ్డారు.

ఏలూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: మాజీ మంత్రి ఆళ్ల నానిపై చీటింగ్ కేసు నమోదైంది. ఎన్నికల ప్రచార సమయంలో వైకాపా నాయకురాలు నాగమణి గాయపడ్డారు. వైద్య ఖర్చులు భరిస్తామని అప్పట్లో ఆళ్ల నాని హామీ ఇచ్చినట్లు ఆమె చెబుతున్నారు. తమ కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారని.. అనంతరం పట్టించుకోలేదని నాగమణి కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో ఆళ్ల నాని సహా ఏడుగురిపై ఏలూరు 3 టౌన్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదైంది.



## విశాఖలో అంతర్జాతీయ షాపింగ్ మాల్: లులు గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీ

విశాఖలో అంతర్జాతీయస్థాయి షాపింగ్ మాల్ నిర్మిస్తామని లులు గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీ తెలిపారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: 'లులు' సంస్థను ఏపీకి ఆహ్వానించినందుకు ఆ సంస్థ చైర్మన్ యూసుఫ్ అలీ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబుతో 18 ఏళ్ల అనుబంధం ఉన్నట్లు గుర్తు చేసుకున్నారు. ఆయనతో శనివారం జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయయని అన్నారు. విశాఖలో అంతర్జాతీయస్థాయి షాపింగ్ మాల్ నిర్మిస్తామన్నారు. "షాపింగ్ మాల్లో 8 స్క్రీన్లతో ఐమాక్స్ మల్టీప్లెక్స్ నిర్మిస్తాం. విజయవాడ, తిరుపతిలో హైపర్మార్టు నిర్మిస్తాం. ఏపీలో ఆధునిక ఆహారశుద్ధి కేంద్రాలు, లాజిస్టిక్ హబ్లు నిర్మిస్తాం" అని ఎక్స్ వేదిగా వెల్లడించారు.

## భారాస నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు: దానం నాగేందర్

ప్రజలను భారాస నేతలు రెచ్చగొట్టి తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోపించారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: ప్రజలను భారాస నేతలు రెచ్చగొట్టి తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోపించారు. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి హరీశ్రరావు అవగాహన ఉన్న వ్యక్తి అని.. ప్రజలను ఆయన తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. ప్రభుత్వానికి ఎప్పుడు ఏం చేయాలో తెలుసని వ్యాఖ్యానించారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని తాను కూడా సీఎం రేవంత్రెడ్డి దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు.

## విజయవాడ వరదలు.. సీఎం చంద్రబాబు అద్భుతంగా పనిచేశారు: నిఖిల్

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గాన్ని మంత్రి నారా లోకేశ్ రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారని సినీ హీరో నిఖిల్ కొనియాడారు.

గుంటూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 29: జిల్లా మంగళగిరి నియోజకవర్గాన్ని మంత్రి నారా లోకేశ్ రోల్ మోడల్గా తీర్చిదిద్దుతున్నారని సినీ హీరో నిఖిల్ కొనియాడారు. మంగళగిరిలో అందరి కోసం అమరావతి పేరుతో నిర్వహించిన 10కే, 5కే, 3కే రన్ను నిఖిల్. ఆరో బెటాలియన్ కమాండెంట్ నగేష్ బాబు, కామన్వెల్త్ క్రీడాకారిణి ఘట్టమనేని సాయి రేవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. విజయవాడకు వరదలు వచ్చిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు అద్భుతంగా పనిచేశారన్నారు. త్వరలో కార్తికేయ 3 సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని చెప్పారు.










printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# రైతుల నడ్డి విరుస్తున్న దుర్గా భవానీ ?

## పర్టిలైజర్ అమ్మకాల్లో ఆయన చెప్పిందే వేదం.. ఆయన చేసేదే శాసనం

నంద్యాల జిల్లాలో విస్తరించిన ఆయన వ్యాపార సామ్రాజ్యం

నంద్యాల,బండి ఆత్మకూరు, సంత జుటూరు, వెలుగోడు, గడివేములలో దుకాణాల ఏర్పాటు

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తు రైతుల నడ్డి విరుస్తున్న వైనం

రైతులు అడిగిన ఎరువులు ఇవ్వాలంటే ఆయన షాపులో అమ్ముడు పోకుండ మిగిలిన మందులు కొనాల్సిందే ?

ఆయనకు వ్యవసాయ జిల్లా అధికారులన్న లెక్కేలేదు

ఎందుకంటే సతీమణి, అల్లుడు ఇరువురు డిప్యూటీ తహసీల్దార్ల అండ ఉన్నారనే ధైర్యం

వారి అండతోనే రైతుల పై చిన్న చూపు

**నంద్యాల, సెప్టెంబర్ 29, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా దుర్గా భవానీ ఎరువులు,పురుగు మందుల దుకాణం దారులు ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తూ సామాన్య రైతుల నడ్డి విరిస్తున్నారు. ఎందుకంటే దుర్గ భవాని ఫర్టిలైజర్స్ వ్యాపార సామ్రాజ్యం నంద్యాల జిల్లాలో నాలుగైదు మండలాల్లో విస్తరించి ఉంది.దీంతో ఎరువుల వ్యాపారంలో నేను చెప్పిందే వేదం నా మాటే శాసనం అనే చందాన నేను అమ్మిందే రైతులు కొనాలి.. నేను చెప్పిన ధరకే కొనాలి అనే రకంగా రైతుల పరిస్థితినీ దీనంగా దిగజారుస్తున్నారు. ఫర్టిలైజర్స్ యాజమాన్యం రైతులు అడిగిన ఎరువులు ఇవ్వకుండా వారికి అమ్ముడు పోకుండా నిల్వ ఉన్న ఎరువులు అంటగడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ వాపోతున్నారు.

ఈ క్రమంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్న ఆయనకు జిల్లా వ్యవసాయ అధికారులంటే లెక్కేలేదు.దీంతో రైతులు చేసే దారి లేక , దిక్కు తోచక వారికి అవసరం లేకపోయినా దుకాణం దారులు అంటగడుతున్న ఎరువులు కొనుగోలు చేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అసలే ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న తరుణంలో ఇలాంటి ఎరువులు పురుగుమందుల బడా వ్యాపారి ఆగడాలతో రైతన్నలు లబోదిబో మంటు గగ్గోలు పెడుతున్నారు.కాగా ఇటీవల బండి ఆత్మకూరు మండల పరిధిలోని సంత జుటూరు ఎరువుల దుకాణంలో ఇద్దరు రైతులు పది ఇరవై ఆరు రకం కాంప్లెక్స్ ఎరువుల కేవలం ఆరు బస్తాల కోసం వెళ్లారు.అయితే అక్కడున్న దుకాణం దారుడు అమ్మోనియం పాస్పేట్ రెండు బస్తాలు తీసుకుంటే రెండు బస్తాలు పది ఇరవై ఆరు రకం రెండు బస్తాలు మాత్రమే ఇస్తామని చెప్పారు.మీకు పది ఇరవై ఆరు రకం కాంప్లెక్స్ ఎరువులు ఎన్ని కావాలన్న అన్ని 20,20,0,13 రకం అమ్మోనియం తీసుకోవాలని నిబంధన పెట్టారు.దీంతో సదరు రైతులు ఎరువులు కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది.ఇలాంటి దుస్థితి ఆ ఇద్దరు రైతులదే కాదండోయ్ మరి ఎంతో మంది రైతులు ఇలాంటి పరిస్థితినే అనుభవిస్తున్నారు.అంతే కాకుండ యూరియా కోసం వెళ్లిన రైతులకు పిలకల గుళికలు అంట గడుతున్నారు.వ్యాపార సామ్రాజ్యం విస్తరణకు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కొందరి అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం.ఎందుకంటే ఆయన భార్య,ఆయన అల్లుడు డిప్యూటీ తహసీల్దార్లు పని చేస్తు ఆయన వ్యాపార సామ్రాజ్య విస్తరణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అక్కడ చూసుకుంటారని ఆయన బాహాటంగా చెప్పే బహిరంగ రహస్యం.ఇదిలా ఉండగా ఆయనకు జిల్లా వ్యవసాయ అధికారులన్న చిన్న చూపు.ఆయన దుకాణంలో తనిఖీ కోసం వెళ్లిన వ్యవసాయ అధికారులు మొక్కుబడిగాన ఆరోపణలు లేకపోలేదు.అయితే గతంలో నంద్యాలలోని ఇదే మందుల దుకాణంలో నకిలీ ఫేక్షలాన్ దొరకడంతో గుంటూరు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి షాప్ సీజ్ చేశారు.అయిన ఆయన ఆగడాలు ఆగడం లేదనే రైతులు ఆరోపిస్తున్నారు.అంతంత మాత్రంగా ఉన్న వ్యవసాయానికి తోడు ఇలాంటి మందుల దుకాణం దారులతో రైతులు అవస్థలు పడుతున్నారు.ఇప్పటికైనా నంద్యాల జిల్లా కలెక్టర్ స్పందించి ఆయన ఎరువులు పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని నంద్యాల జిల్లా రైతాంగం కోరుతోంది.


బండి ఆత్మకూరులో తనిఖీ చేస్తున్న ఏడీఏ రాజ శేఖర్ ( ఫైల్ ఫొటో)

### అమ్ముడుపోని మందులు రైతులకు అంటగడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి
### -ఏపీ రైతు సంఘం నాయకులు రత్నమయ్య


ఏపీ రైతు సంఘం నాయకులు రత్నమయ్య

ఎరువులు,పురుగు మందుల దుకాణం దారులు వారికి అమ్ముడుపోని ఎరువులు, పురుగుమందులను అంటగట్టడం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నాయకులు రత్నమయ్య మండిపడ్డారు. మండలంలోని దుర్గ భవాని దుకాణం దారులు రైతులు అడిగిన ఎరువులు కాకుండా వారికి అమ్మడుపోనీ ఎరువులు తీసుకుంటేనే మీరు అడిగిన మందులు ఇస్తామని చెప్పడం సరైందికాదని ఘాటుగా హెచ్చరించారు. ఇలాంటి వారిపై వ్యవసాయ శాఖ జిల్లా ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1901: కేంద్రక భౌతిక శాస్త్రానికి పితృతుల్యుడు ఎన్ రికో ఫెర్మి జననం (మ.1954).
- 1932: భారతీయ నటుడు, దర్శకుడు, నిర్మాత మెహమూద్ జననం (మ.2004).
- 1934: వెస్టిండీస్‌కు చెందిన ప్రముఖ మాజీ క్రికెట్ క్రీడాకారుడు లాన్స్ గిబ్స్ జననం.
- 2008: హైదరాబాదు నగరానికి చెందిన ఎం.ఐ.ఎం పార్టీ నాయకుడు సుల్తాన్ సలాహుద్దీన్ ఒవైసీ మరణం (జ.1931).
- 2008: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా, కులనిర్మూలన సంఘ అధ్యక్షునిగా పనిచేసిన జాగర్లమూడి వీరాస్వామి మరణం (జ.1919).
- 2008: తెలుగు కవి, విమర్శకుడు, విద్యావేత్త పేర్వారం జగన్నాథం మరణం (జ.1934).


ఎన్ రికో ఫెర్మి


మెహమూద్


లాన్స్ గిబ్స్


సుల్తాన్ సలాహుద్దీన్


జగన్నాథం

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ముంబయి ఇండియన్స్.. ఆ ముగ్గురు వేలానికి వెళ్తే తిరిగి రావడం కష్టం :భారత మాజీ క్రికెటర్

ఐపీఎల్ మెగా వేలానికి ముందు ఫ్రాంచైజీలు ఎంత ఆటగాళ్లను రిటైన్ చేసుకోవాలనే అంశంపె క్లారిటీ వచ్చింది.



ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలం నేపథ్యంలో ఫ్రాంఛైజీలు ఎంతమందిని రిటైన్ చేసుకోవచ్చనే అంశంపై స్పష్టత వచ్చింది. ఒక్కో ఫ్రాంఛైజీ ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఐపీఎల్ పాలకవర్గం అనుమతినిచ్చింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ కలిసి ఉంటుంది. ఎంత మందిని రిటైన్ చేసుకోవచ్చనే దానిపై స్పష్టత రావడంతో ఏ ఫ్రాంఛైజీ ఎవరెవరిని అట్టిపెట్టుకుంటుందనే దాని గురించి చర్చ మొదలైంది. ఐపీఎల్ అభిమానులు, మాజీ క్రికెటర్లు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. భారత మాజీ క్రికెటర్ అజయ్ జడేజా ముంబయి ఇండియన్స్ ఎవరిని రిటైన్ చేసుకుంటే జట్టు ఎక్కువ ప్రయోజనం పొందుతుందో తెలిపాడు. ఇన్నాళ్లు జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ ప్రీత్ బుమ్రాలను ముంబయి కచ్చితంగా రిటైన్ చేసుకోవాలని సూచించాడు. వేలంలోకి వెళితే వారిని తిరిగి దక్కించుకోవడం అసాధ్యమని పేర్కొన్నాడు. “రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రాలను ముంబయి ఇండియన్స్ నిస్సందేహంగా రిటైన్ చేసుకుంటుందని చెప్పగలను. ఒకవేళ వేలంలోకి వెళ్తే ఈ ఆటగాళ్లను తిరిగి పొందడం అసాధ్యం. హార్దిక్ పాండ్య కోసం ముంబయి తమ రైట్ టు మ్యాచ్ (ఆర్టీఎం) కార్డును ఉపయోగించవచ్చని భావిస్తున్నా. హార్దిక్ లాంటి ప్రతిభావంతుడైన ఆటగాడిని వేలంలో దక్కించుకోవడం కష్టం. కానీ, అతడు తరచూ గాయాల బారినపడతాడు. దీంతో పాండ్య కోసం ఇతర ఫ్రాంఛైజీలు భారీ మొత్తంలో వెచ్చించడానికి వెనకడుగు వేసే అవకాశముంది. ఆర్టీఎం ఉంటే దాన్ని చక్కగా ఉపయోగించుకోవాలి. అంతేకాని ఇది ఆటగాడి సామర్థ్యం లేదా శక్తిని నిర్ణయిస్తుందని నేను చెప్పడం లేదు” అని అజయ్ జడేజా వివరించాడు. రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల జాబితాను సమర్పించడానికి అక్టోబర్ 31 డెడ్లైన్ విధించినట్లు తెలుస్తోంది. మెగా వేలాన్ని దుబాయ్ లేదా సౌదీ అరేబియాలో నవంబర్లో నిర్వహించే అవకాశముంది.

## ఫిట్‌నెస్

# కరివేపాకులో వేటిని కలిపి తలకి రాస్తే జుట్టు పొడుగ్గా పెరుగుతుంది

కరివేపాకు జుట్టు ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే, జుట్టు త్వరగా పెరగాలంటే ఏం చేయాలో తెలుసుకోండి. కరివేపాకు ఆరోగ్యానికి చాలా మంచిది. అదే విధంగా, జుట్టు ఆరోగ్యానికి కూడా మరింత మంచిది. కరివేపాకుని హెయిర్ సీరమ్‌లా చేసి వాడితే జుట్టు స్పీడ్‌గా పెరుగుతుంది. మరి దీనిని ఎలా తయారు చేయాలి? దీనిని ఎలా వాడాలి పూర్తి వివరాలు తెలుసుకోండి.





### కరివేపాకు..

కరివేపాకులో విటమిన్ సి, విటమిన్ బి, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి స్కాల్ప్ ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. దీనిని రాయడం వల్ల చుండ్రు, జుట్టు రాలడం తగ్గుతుంది. జుట్టు ఆరోగ్యం మెరుగవుతుంది.


**ఎలా తయారుచేయాలి?**

కరివేపాకు – గుప్పెడు
అల్లం తురుము – కొద్దిగా
విటమిన్ ఇ క్యాప్సూల్స్ – 2
అర చెక్క నిమ్మకాయ




### ఎలా తయారు చేయాలి?

కరివేపాకుని బాగా కడిగి నానబెట్టాలి. ఓ చిన్న గిన్నెలో నీరు పోయండి. అందులో కరివేపాకు వేసి నానబెట్టండి.ఇప్పుడు నానబెట్టి కరివేపాకు, అల్లం మిక్సీ జార్‌లో వేసి గ్రైండ్ చేయాలి. దీనిని మెత్తగా గ్రైండ్ చేయాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని ఫిల్టర్ చేయాలి. అందులో విటమిన్ ఇ క్యాప్సూల్, నిమ్మరసం వేసి బాగా కలపాలి.



### ఎలా వాడాలి..

తయారైన హెయిర్ సీరమ్‌ని స్ప్రే బాటిల్‌లో వేయాలి. దీనిని ఫ్రిడ్జ్‌లో స్టోర్ చేయాలి. ఇది 2 వారాల వరకూ ఫ్రెష్‌గా ఉంటుంది. హెయిర్ సీరమ్‌ని తలపై స్ప్రే చేసి మెల్లిగా మసాజ్ చేయాలి. వారానికి 2 సార్లు దీనిని మసాజ్ చేసి అరగంట నుంచి గంట తర్వాత క్లీన్ చేసుకోవాలి.



### బెనిఫిట్స్..

పరిశోధనల ప్రకారం, కరివేపాకులో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇవి జుట్టుని పెంచుతాయి. అయితే, దీనిని వాడే ముదు ప్యాచ్ టెస్ట్ చేయడం మంచిది. దీనిని రెగ్యులర్‌గా వాడితే మంచి రిజల్ట్స్ ఉంటాయి.

గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

